# ఆదిలాబాద్ వార్త

అదిలాబాద్, మంచిర్యాల, అసిఫాబాద్, నిర్మల్,

గురువారం 20, జులై 2023 | 8 పేజీలు




## ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి

- కేటాయించిన పోలీసు విధులను సక్రమంగా నిర్వర్తించాలి
- జిల్లా ఎస్పీ డి ఉదయ్‌కుమార్‌రెడ్డి
- జిల్లా ఎస్పీకి మర్యాదపూర్వకంగా కలిసిన 15 మంది ఎస్సైలు

*ఆదిలాబాద్, ప్రభాతవార్త:*
ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉన్నతమైన సేవలను అందించాలని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు.



2 లో..

## నిర్మల్ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు



2 లో..



*నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :*
నిర్మల్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు పడే సూచనలు ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు.

## కాంగ్రెస్ కరెంటు కుట్రలపై భగుమన్న రైతన్నలు

2లో...



- టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలపై రైతన్నల నిరసన
- రాష్ట్ర మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



*నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :*
వ్యవసాయానికి గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో సోన్ మండల కేంద్రంలోని రైతువేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతులకు మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు రైతులు భగ్గు మన్నా రన్నారు.



2 లో..

## ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు

- చిన్న,సన్నకారు రైతుల ఉద్యాన పంటలు వేసేలా ప్రోత్సహించాలి
- ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% రాయితీ, మిగతా వారికి 90% రాయితీ
- 1,467 ఎకరాల లక్ష్యాన్ని చేరుకోవాలి
- డ్రిప్ ఇరిగేషన్ సిస్టానికి పూర్తి సహకారం
- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

*ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త*
జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి ఉద్యానవన, వ్యవసాయ శాఖలు, ఉపాధిహామీ పథకం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు.

## జాతీయ నులిపురుగుల దినోత్సవం

2లో...

అవగాహన పోస్టర్లు, బ్యానర్లు, కరపత్రాల విడుదల

*ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త*
జాతీయ నులిపురుగుల దినోత్సవం(నేషనల్ డివోమింగ్ డే) సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో ఆరోగ్య అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆల్బెండజోల్ మాత్రలు, బ్యానర్లు, కరపత్రాలు విడుదల చేశారు.



-జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జిసి సుబ్బారాయుడు










# ఉద్యానవన పంటల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

**మొదటి పేజి తరువాయి :** జిల్లాలో ఉద్యానవన పంటల అభివృద్ధికి ఉద్యానవన, వ్యవసాయ శాఖలు, ఉపాధిహామీ పథకం అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. బుధవారం జిల్లాలోని సమీకృత జిల్లా శాఖల కార్యాలయ భవన సమావేశ మందిరంలో జిల్లా ఉద్యానవన, వ్యవసాయ శాఖల అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, సాంకేతిక సహాయకులు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ అధికారుతలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధిహామి పథకం క్రింద ఉద్యానవన పంటల అభివృద్ధి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో సాగునీటి వసతి గల 5 ఎకరాల విస్తీర్ణం లోపు గల చిన్న, సన్నకారు రైతులను ఉద్యానవన పంటలు సాగు చేసే విధంగా ప్రోత్సహించాలని ఎస్సీ, ఎస్టీ రైతులకు 100% రాయితీ ఇవ్వడం జరుగుతుందని



మిగిలిన వారికి 90 శాతం రాయితీలో టాం-టాం చేయించడం, రైతు వేదికలలో సదస్సులు నిర్వహించడం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. వివిధ రకాల పండ్ల మొక్కలు మామిడి సీతాఫలం, స్వీట్ ఆరెంజ్, జామ, సపోట, జీడితో పాటు డ్రాగన్ ఫ్రూట్ కూడా అందించడం జరుగుతుందని, వీటిని ఉద్యానవన శాఖ పరిధిలో నిర్ణయించిన నర్సరీల ద్వారా పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హత గల లబ్దిదారుల ఎంపిక అనంతరం శాఖ పరమైన అనుమతులు పొందిన తరువాత మొక్కలు పిట్టింగ్, ప్లాంటింగ్ ప్రక్రియ ప్రారంభం అవుతుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర సూక్ష్మ నీటిపారుదల ప్రాజెక్ట్ క్రింద డ్రిప్ ఇరిగేషన్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని, అర్హత గల రైతులను గుర్తించి ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లాకు కేటియించిన 1వేయి 467 ఎకరాల లక్ష్యాన్ని సాధించే విధంగా వ్యవసాయ ఉద్యానవన, ఉపాధి హామి అధికారులు సమన్వ యంతో కృషి చేయాలని, ఆగస్టు మాసాంతం వరకు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో 5ఎకరాల విస్తీర్ణం కన్నా అధికంగా భూమి గల రైతులను ఆయిల్ ఫామ్ పంట సాగు చేసేలా ప్రోత్స హించాలని, ఆయిల్ఫామ్ పంట సాగుతో కలిగే లాభాలను రైతులకు వివరించి పంట సాగు విస్తీర్ణం పెరిగేలా చూడాలని తెలిపారు. జిల్లాలో 2023-24 సంవత్సరానికి గాను ఆయిల్ఫామ్స్ పంట సాగుపై నిర్ణయించిన 3వేల 400 ఎకరాల లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణభివృద్ది అధికారి

# ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆదిలాబాద్, ప్రభాతవార్త:




**మొదటి పేజి తరువాయి :** ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఉన్నతమైన సేవలను అందించాలని జిల్లా ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ జిల్లాకు కేటాయించిన 26 మంది ఎస్సైలలో 15 మంది బుధవారం ఉదయం జిల్లా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా జిల్లా ఎస్పీని కలవడం జరిగింది. ఈ15మంది ఎస్ఐలు నిజామాబాద్ కమిషనరేట్ నుంచి ఆదిలాబాద్‌జిల్లాకు కేటాయించ బడ్డారు. ఈసందర్భంగా ఎస్పీ మాట్లా డుతూ కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తిస్తూ ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ ఉన్నతమైన సేవలను అందించాలని తెలిపారు. తమకు కేటాయించిన పోలీసు స్టేషన్‌లో ప్రజలతో సంబంధాలు పెంచుకొని అసాంఘిక కార్య కలాపాలను పూర్తిగా రూపుమాపాలని తెలిపారు. జిల్లాకు కేటాయించబడిన ఎస్సైలకు త్వరలో పోస్టింగ్‌ను కల్పిస్తామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో సీసీ దుర్గం శ్రీనివాస్, స్పెషల్ బ్రాంచ్ ఎస్సై అన్వర్ ఉల్ హక్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కరెంటు కుట్రలపై భగ్గుమన్న రైతన్నలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :

**మొదటి పేజి తరువాయి :** వ్యవసాయానికి గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు నిరసనగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్, మంత్రి కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో సోన్ మండల కేంద్రంలోని రైతువేదికలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అటవీ, పర్యావరణ, న్యాయ, దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి మాట్లాడుతూ కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో రైతులకు సీఎం కేసీఆర్ అండగా నిలిస్తే కాంగ్రెస్ పార్టీ మాత్రం రైతులకు మూడు గంటలు కరెంటు ఇస్తే సరిపోతుందని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలకు రైతులు భగ్గుమన్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో ఏనాడైనా 24 గంటల ఉచిత నిరంతర విద్యుత్‌ని ఇచ్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రాన్ని మళ్లీ అంధకారంలోకి నెట్టాలని చూస్తున్నదని, వారి పాలనలో ఏనాడు పగటిపూట కరెంటు ఉండేది కాదని రాత్రిపూట రైతులు పంటపొలాల వద్ద జాగారం చేసే పరిస్థితి ఉండేదన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా వ్యవసాయానికి సాగునీరు, 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తుండడంతో రైతులు మూడు పంటలు పండిస్తూ ఎంతో సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. రైతురాజ్యం అంటే కేవలం మాటల్లోనే కాక దాన్ని చేతల్లో చేసి చూపించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.




బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలతో అన్నదాతలు సంతోషంగా ఉండటం కాంగ్రెస్ పార్టీకి ఇష్టంలేదని, రైతులందరూ బాగుంటే రేవంత్‌రెడ్డి లాంటి వారు పరేషాన్‌లో ఉన్నారని ధ్వజమెత్తారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ రైతులను రాజకీయ ఓటు బ్యాంకుగా చూసిందే తప్పా ఏనాడు వారి సంక్షేమానికి చిత్తశుద్ధితో పనిచేయలేదని కాంగ్రెస్ తీరును ఎత్తిచూపారు. రైతు బంధు, రైతుభీమా పథకాలతో రైతు లను ఆదుకుంటుంటే కాంగ్రెస్ ఇలాంటి పథకాలు ఎందుకు అమలు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డికి రైతు కష్టాలు ఏమి తెలుసని ఏనాడైనా అరకపట్టి దుక్కి దున్నిండా అని ఎద్దేవచేశారు. ఆనాడు టిడిపి హయాంలో ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలపై బషీర్‌బాగ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులపై చంద్రబాబు నాయుడు కాల్పులు జరిపి ముగ్గరిని పొట్టనపెట్టుకున్నాడన్నారు. ఇవాళ ఆయన శిష్యుడు రేవంత్ రెడ్డి కూడా ఉచిత కరెంటు వద్దంటున్నాడు.

**రైతుల ఆత్మహత్యలు లేవు.. వలసలు లేవు...**

రైతులు మంచిగా బతుకుతుంటే కాంగ్రెస్ కడుపుమంటగా ఉంది. పుష్కలమైన సాగునీరు, నాణ్యమైన నిరంతర కరెంటు సరఫరా రైతుబంధు లాంటి అనేక సంక్షేమ పథకాలతో అన్నదాతలు ఆర్థికాభివృద్ధి సాధించారు. అనంతరం రాష్ట్ర సర్కారు వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ పథకాన్ని కొన సాగించాలని 3 గంటలు వద్దు 3 పంటలు కావాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని ఆమోదించారు.

## నిర్మల్ జిల్లాలో భారీ నుంచి అతిభారీ
# వర్షాలు పడే అవకాశం

నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :



**మొదటి పేజి తరువాయి :** ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణశాఖ సూచనల మేరకు జిల్లాలోని సమస్యాత్మక ప్రాంతాల్లో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ పరిస్థితులను, ఎదుర్కొనేలా చర్యలు చేపట్టా లన్నారు. ఇరిగేషన్ అధికారులు వారి వారి పరిధిలోని చెరువులు, కుంటలు, నీటి వనరులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, వాగులు కల్వర్టుల వద్ద ప్రవాహం అధికమైన చోట రాకపోకలు జరుపకుండా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షంలో చేపలు పట్టుటకు వెళ్లరాదని, ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు వెళ్లరాదని, లోతట్టు ముంపు ప్రదేశాల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అత్యవసరం అయితే బయటకు రావద్దని సూచించారు. అధికారులు హెడ్ క్వార్టర్‌లో ఉంటూ నిరంతరం పర్యవేక్షణ చేయాలని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పాలనాధికారి తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో అత్యవసర హెల్ప్‌లైన్ నంబర్ 9398749227 ఏర్పాటుచేయడం జరిగిందని, ఈ హెల్ప్‌లైన్ నంబర్ 24 గంటలు పనిచేస్తుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

# జాతీయ నులిపురుగుల దినోత్సవం

ఉమ్మడి ఆదిలాబాద్ బ్యూరో, ప్రభాతవార్త

**మొదటి పేజి తరువాయి :** జాతీయ నులిపురుగుల దినోత్సవం(నేషనల్ డివోమింగ్ డే) సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో ఆరోగ్య అవగాహన కార్యక్ర మాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్ర మంలో ఆల్బెండజోల్ మాత్రలు, బ్యానర్లు, కరపత్రాలు విడుదల చేశారు. తేదీ 20.07.2023 రోజున 1నుండి 19సం॥ల పిల్లలందరికి ఆల్బెండజోల్ మాత్రలను తినిపించడం జరుగుతుందన్నారు. మంచిర్యాల్ జిల్లాలో 2090 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో, అంగన్వాడి కేంద్రములో 1-19 సంవత్సరాల పిల్లలు సుమారు 1,94,282 మంది ఉన్నారు. వీరందరికి మాత్రలు తినిపించడం జరుగుతుంద న్నారు. ఏదైనా కారణా లతో మాత్రలు తీసుకోని వారికి 27.07. 2023 నాడు తినిపించబడును. ఆరోగ్య వంతమైన పిల్లల కోసం మాత్రలు తినిపించడం. మాత్రలు వైద్య ఆరోగ్యశాఖ ద్వార ఐఈసి మందులు పిహెచ్ సిలకు, కళాశాలలకు, పాఠశాలలకు, అంగన్వాడీలకు పంపిణీ చేయడం జరుగుతుంది. 1 నుండి 2 సం॥ల పిల్లలకు ఒక టాబ్లెట్‌ను తినిపించాలి. ఆయా కేంద్రాలలో ఆశ, ఆరోగ్యకార్యకర్తలకు కంటెంట్ నంబర్



ఇవ్వడం జరిగింది. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల పిల్లలు నిపుణుల బృందం, వైద్యుల బృందాలను ఏర్పాటు చేయడం జరిగింది. వీరిని ఆర్.బి.ఎస్.కె.టీములు పర్యవేక్షిస్తాయి.

-నులిపురుగుల బారిన పడకుండా పరిష్కార మార్గాలు....

1. నులి పురుగుల దినోత్సవం రోజున ఆల్బెండ జోల్ మాత్రను తినిపించడం
2. వ్యక్తిగత పరిశుభ్రత గురించి తెలియచేయడం
3. నులిపురుగులు వ్యాప్తి చెందకుండా భోజనం చేసే ముందు తర్వాత చేతులను శుభ్రంగా కడగాలి
4. పరిశుభ్రమైన మరుగు దొడ్లను వాడాలి బయటకు వెళ్లినప్పుడు చెప్పులు ధరించాలి.
5. బాగా ఉడికిన ఆహారమును తీసుకోవాలి గోళ్లను చిన్నవిగా, శుభ్రముగా ఉంచుకోవాలి

ఈ కార్యక్రమంలో ఆరోగ్య, విద్యా, వైద్య, ఐసిడిఎస్ మున్సిపల్ సిబ్బంది సహకరించి విజయ వంతం చేయాలని కోరడమైనది. ఈ కార్యక్ర మంలో పిఒలు డాక్టర్ అనిత, డాక్టర్ నీరజ, డాక్టర్ విజయ పూర్ణిమ, డిప్యూటీ డిఎం అండ్‌హెచ్‌వో డాక్టర్ ఫయాజ్, డీఎస్‌వో విశ్వేశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ బుక్క వెంకటేశ్వర్లు, మాస్ మీడియా అధికారి పాల్గొన్నారు.

## నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ మార్కెట్,

# తెనెశుద్ధి కర్మాగార స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్

**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**

నిర్మల్ పట్టణంలో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థల సేకరణ, వైకుంఠదామం నిర్మాణం పనులు, సోఫీనరర్‌లోని విజయడైరీ ఫామ్, తేనెశుద్ధి, గిరి సబ్బుల తయారీ కర్మాగారాలను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి పరిశీలించారు. బుధవారం పట్టణంలో కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. మొదట పట్టణంలో నిర్మించబోయే ఇంటిగ్రేటెడ్ మార్కెట్ స్థల సేకరణ కొరకు దాదాపు 3 ఎకరాలు ఉన్న



ఎంఆర్‌వో, ఆర్‌అండ్‌బి కార్యాలయాలను తీసివేసి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మించేందుకు స్థలాన్ని పరిశీలించారు. వైకుంఠదామం నిర్మాణం పనులను త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. అనంతరం సోఫీనగర్‌లోని విజయడైరీఫామ్, చుట్టుపక్కల గలఖాళీ ప్రదేశాలను పరిశీలించారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన సంస్థ ద్వారా గిరి సబ్బుల తయారీ కర్మాగారము, తెనె శుద్ధి కర్మాగారంను పరిశీలించి అక్కడి వివరాలను అడిగి తెలుసుకున్నారు.

---

## 3వరోజు కొనసాగిన ఆప్ బస్తీబాట కార్యక్రమం



**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**

3వ రోజు ఆమ్ ఆద్మీ పార్టీ నిర్మల్ జిల్లా కో ఆర్డినేటర్ సయ్యద్ హైదర్ ఆధ్వర్యంలో బుధవారం రోజు బంగల్‌పేట్ మహాలక్ష్మి వాడలో ఆప్ నాయకులతో కలిసి ఆయన బస్తీబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భగా భారీ వర్షంలో సైతం ఆప్ నాయకులతో కలిసి సయ్యద్ హైదర్ ఇంటింటికి తిరుగుతూ, వారితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో సరైన రోడ్లు, డ్రైనేజీలు, వీధిలైట్లు కూడా లేవని మండిపడ్డారు. వర్షాకాలంలో చిన్నపాటి వర్షానికి రోడ్లన్నీ బురదమయంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని ప్రజలు తమ సమస్యలను తెలిపారని, ఈ ఇక్కడ చిన్నపిల్లలకు అంగన్‌వాడీ కేంద్రం లేదని, కనీసం రేషన్‌షాపు కూడా లేదని అన్నారు. దీనివల్ల కొన్ని సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు అనేకరకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి అభివృద్ధి చేసిన అని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. నూతన కలెక్టర్ ఆఫీసుకు కూతవేటు దూరంలో ఇంతపెద్ద సమస్య ఉంటే మీకు కనబడడం లేదా అని అన్నారు. ఇంకా ఎక్కడ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఇప్పటికైనా మంత్రి, జిల్లా అధికారులు, మున్సిపల్ అధికారులు స్పందించి వార్డులో గల సమస్యలను పరిష్కరించాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నిర్మల్ టౌన్ కన్వీనర్ ద్యావరశెట్టి రవీంధర్, కో కన్వీనర్ సాయికుమార్, మహిళా వింగ్ షబానా బేగం, తిరుమల, సంగీత, టౌన్ మైనార్టీ కన్వీనర్ సోఫి మహమ్మద్ ఇమ్రాన్, అలీషా, మహమ్మద్ అలీఖాన్, ఆప్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్వీప్రసాద్ ఉచిత నేత్ర శిభిరం ప్రారంభించిన ఉద్యమనేత శ్రీహరిరావు

**సారంగాపూర్, ప్రభాతవార్త :**

సారంగాపూర్ మండల కేంద్రంలోని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఎల్వీ ప్రసాద్ నేత్రవైద్య విజ్ఞాన సంస్థ ఆధ్వర్యంలో తమ సోదరుడు కూచాడి భాస్కర్‌రావు గ్రామీణ వైద్య కేంద్రానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉద్యమ నేత, నిర్మల్ కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు ఈకార్యక్రమాన్ని సారంగాపూర్ స్థానిక నాయకులు జడ్పీటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, రిబ్బన్‌కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీహరిరావు మాట్లాడుతూ మండల ప్రజలతో పాటు పొరుగున ఉన్న మహారాష్ట్ర ప్రజలకు ఉచితంగా కంటి పరీక్షలు అందించిన ఉద్దేశంతో ఆసుపత్రిని ప్రారంభించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కూచాడి భాస్కర్‌రావు గారి కూతురు అర్పిత, మండల నాయకులు మాజీ మార్కెట్ చైర్మెన్ దశరథ్ రాజేశ్వర్, బొల్లోజి నర్సయ్య, ఆది, సలీమ్, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులు రావడం లేదని ఆగ్రహించిన గ్రామస్థులు



**ఖానాపూర్, ప్రభాతవార్త :**

నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండలంలోని రేవోజిపేట్ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న సురేఖ(ఎస్.ఎ) ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలు గత రెండు సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియమితులయ్యారు. కాగా పాఠశాలకు రావడం లేదని సమాచారం తెలుసుకున్న గ్రామస్థులు బుధవారం పాఠశాలకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. పాఠశాలకు రాకపోవడంతో గ్రామస్థులు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. సమాచారం తెలుసుకున్న మండల తహసిల్దార్ పాఠశాలకు చేరుకుని గ్రామస్థులకు హామీనిచ్చారు. వెంటనే జిల్లా ఉన్నత విద్యాధికారికి చరవాణి ద్వారా సురేఖ పాఠశాలకు రావడం లేదని సమాచారం అందించారు. విద్యాధికారి మెమో అందజేస్తామని అన్నారు. పాఠశాలకు రాకున్నా జిల్లా కేంద్రంలో లైవ్ లొకేషన్ పెడుతూ బుధవారం 11 గంటలకు రావడం జరిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. స్థానిక ఎస్సై వచ్చి గ్రామస్థులకు సర్దిచెప్పారు. ఎస్ఎంసి చైర్మెన్ వెంకటరమణ, వైస్ చైర్మెన్ రాజేశ్వరి, మహేష్, విద్యార్థుల తల్లితండ్రులు ఈ ఉపాధ్యాయురాలు వద్దు అని ఎంఆర్‌వోకి విన్నవించుకున్నారు.

## నిలిచిపోయిన రాకపోకలు



**కడెం, ప్రభాతవార్త :**

కడెం మండలంలోని గంగాపూర్ రోడ్డు, ఇటీవల కురిసిన వర్షాలకు కోతకు గురై రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైందని గ్రామస్థులు పేర్కొన్నారు. కొర్రతాండ, దుబ్బతాండ, చౌడుతాండ, దేవునిగూడెం, దత్తోజిపేట్, రామిగూడెం, లక్ష్మిపూర్ తదితర గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామన్నారు. పాలకులు ఎవరైనా, పరిపాలన ఎవరిదైనా ప్రజల కష్టాలు తీర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నారు అని గ్రామస్థులు మండిపడ్డారు. మా గ్రామస్థుల గోస తీరేదెన్నడో అని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకునేవారే లేరని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏదైనా అత్యవసర వైద్యానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులకుగురి కావల్సి వస్తుందని తెలిపారు. వర్షాకఆలం వచ్చిదంటే చాలు ప్రాణాలు భయంగుప్పెట్లో పెట్టుకుని బతకాల్సి వస్తుందని వాపోయారు.

**- కడెం పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి...**

కడెం పరివాహక ప్రాంతంలో (క్యాచ్మెంట్) వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున బుధవారం రోజున 6.30 గంటలకి కడెం ప్రాజెక్టు వదరగేట్ తెరిచి నీటిని కిందికి వదలడం జరిగింది. కావున నదీ పరివాహక ప్రాంతంలోకి (దిగువన) పశువులుగాని, గొర్రెలుగాని మొదలగునవి వెళ్లకుండా అలాగే పల్లె కాపరులు, గొర్రెల కాపరులు రైతులువెళ్లకుండా అప్రమత్తంగా ఉండవలెనని ఇరిగేషన్ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

---

## నిర్మల్ వార్త



## నులిపురుగుల దినోత్సవంను విజయవంతం చేయాలి

**- జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి**

**నిర్మల్ కలెక్టరేట్, ప్రభాతవార్త :**



నులిపురుగుల దినోత్సవ కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నులిపురుగుల నివారణ కార్యక్రమం బ్యానర్‌ను జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి విడుదల చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న 1-19 సంవత్సరాల వయస్సు గల పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలను మింగించాలని కోరారు. వైద్య, ఆరోగ్యశాఖ, విద్యాశాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఇతర లైన్ డిపార్ట్‌మెంట్స్ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పిల్లలందరూ మాత్రలు మ్రింగేవిధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధన్‌రాజ్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ జిల్లా విస్తరణ, మీడియా అధికారి బారి రవీంధర్ తదితరులు పాల్గొన్నారు.

## డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను పరిశీలించిన కాంగ్రెస్ నేత శ్రీహరిరావు

**- నాసిరకంగా డబుల్‌బెడ్‌రూమ్‌లు నిర్మించారని మండిపాటు**


**నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :**

పేదలు ఆత్మగౌరవంతో బతకాలని నాణ్యతలేని డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు లబ్ధిదారులకు ప్రభుత్వం అందించి చేతులు దులుపుకుందని కాంగ్రెష్ నేత శ్రీహరిరావు విమర్శించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయ భవనం ఎదురుగా లబ్ధిదారులకు అందించిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లను బుధవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న చిన్నపాటి వర్షానికి ఇండ్లన్నీ ఊరుస్తున్నాయని అన్నారు. స్లాబుపై అంతస్తు పెచ్చులు ఊడుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇండ్లు లేని నిరుపేదలకు డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు వచ్చాయన్న ఆనందం ఆవిరి అయిపోతుందని అన్నారు. ఎలాంటి సౌకర్యాలు లేకుండానే లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించారని విమర్శించారు. సుమారు 500 మంది నివసించే కాలనీలో కేవలం ఒక్క బోరు మాత్రమే ఉందని అన్నారు. వర్షానికి రోడ్లన్నీ చిత్తడిగా మారి అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి స్వగ్రామానికి కూతవేటు దూరంలో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నాణ్యత లేకుండా నిర్మించడం మంత్రి అవినీతికి అద్దం పడుతుందని విమర్శించారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఇందులో జడ్పీటిసి రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



# బెల్లంపల్లిలో బిజేపి మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమం

**-ముఖ్య అతిథిగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు వెర్రబెల్లి రఘునాథ్**
**-బిజేపి కార్యకర్తల సహపంక్తి భోజనాలు**
**-గ్రామపంచాయతీ పరిశుద్ధ కార్మికుల సమ్మెకు బిజేపి సంఘీభావం**



బెల్లంపల్లి, ప్రభాతవార్త

మహాజన్ సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం రోజున బెల్లంపల్లి నియోజకర్గంలోని బెల్లంపల్లి పట్టణంలో బెల్లంపల్లి నియోజకవర్గ కన్వీనర్ రాచర్ల సంతోష్ అధ్యక్షతన టిఫిన్ బైటేక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంచిర్యాల జిల్లా అధ్యక్షులు రఘునాథ్ వెర్రబెల్లి బెల్లంపల్లి నియోజకవర్గ ఇంచార్జి అన్నపూర్ణ సుదర్శన్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు రఘునాథ్ మాట్లాడుతూ బిఆరఎస్ పార్టీ కాంగ్రెస్ పార్టీ వాళ్లు బీరు బిర్యానీలు ఇచ్చి సమావేశాలు నిర్వహించి ప్రజలను కార్యకర్తలను మభ్యపెడుతూ ఉంటే భరతీయ జనతా పార్టీ కార్యకర్తలకు రాష్ట్ర పార్టీ పిలుపుమేరకు నియోజకవర్గంలోని అన్ని మండలాల కార్యకర్తలు ఎవరి టిఫిన్ డబ్బాలు వారు పట్టుకొని వచ్చి ఒక కుటుంబంలోని కుటుంబ సభ్యులలాగా సమాపంక్తి భోజనాలు చేస్తూ భోజనాలు చేస్తూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తలకు నేర్పిన సాంస్కృతి సాంప్రదాయం ఇదే పట్టుదలతో బెల్లంపల్లి నియోజకవర్గంలో మంచిర్యాల జిల్లాలో తెలంగాణ రాష్ట్రంలో అధికార బిఆర్ఎస్ పార్టీని రాబోయే ఎన్నికలలో బొంద పెట్టడానికి కార్యకర్తలు అందరూ రెడీగా ఉన్నారు. అని అన్నారు. తదుపరి గత 14 రోజులుగా గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న నిరసన దీక్షకు భారతీయ జనతా పార్టీ ఆధ్వ ర్యంలో సంఘాభావం తెల పడం జరిగింది. ఈ కార్య క్రమంలో బెల్లంపల్లి పట్టణ అధ్య క్షులు కోడి రమేష్, బెల్లంపల్లి మండల అధ్యక్షుడు గజెల్లి రాజ్ కుమార్, తాండూర్ మండల అధ్యక్షులు రామగోని మహిధర్ గౌడ, భీమిని మండల అధ్యక్షులు కొంక సత్య నారాయణ, కన్నేపల్లి మండల అధ్యక్షులు బేర రామన్న యాదవ్, ఎస్సీ మోర్చా పార్లమెంట్ కన్వీనర్ పానగంటి మధు, ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పాగిడి చిరంజీవి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీ కృష్ణదే వరాయలు, కాసిపేట మండల ప్రధాన కార్యదర్శి సూరం సంపత్, బెల్లంపల్లి నియోజక వర్గంలోని మండల పాదాధికారులు జిల్లా పాధాధికారులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# మంచిర్యాల వార్త

## అభివృద్ధి పనుల స్థల పరిశీలన

రామకృష్ణపూర్, ప్రభాతవార్త



క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో అదనపు పాలనాధికారి(స్థానిక సంస్థలు) ఐఏఎస్ బి.రాహుల్ బుధ వారం నాడు ఆకస్మికంగా సంద ర్శించారు. త్వరలో చేపట్టబోయే అభివృద్ధి పనుల స్థల పరిశీలన చేసి సంబంధిత మున్సిపల్ అసిస్టెంట్ ఇంజనీర్‌కి అట్టి పనులను నాణ్యతతో చేపట్టవలసిందిగా మౌలిక ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ సాగర్ రెడ్డి, కమిషనర్ వెంకట్ నారాయణ మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

**-విద్యావంతులు, యువత రాజకీయాల్లోకి రావాలి**
**-కేజీ టు పీజీ విద్యాసంస్థల జేఏసీ సభ్యులు**



నస్పూర్, ప్రభాతవార్త

రాష్ట్రంలోని కేజి టు పీజీ ప్రైవేట్ విద్యాసంస్థల సమస్యలు పరిష్కరించాలని కేజి టు పీజీ ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసీ మంచిర్యాల జిల్లా కన్వీనర్ రాపోలు విష్ణువర్ధన్ రావు, కో కన్వీనర్ చంద్రమోహన్ గౌడ్ అన్నారు. బుధవారం నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్ షిప్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని కోరారు. ప్రైవేటు విద్యాసంస్థల సమస్యలపై అన్ని రాజకీయ పార్టీల ఫ్లోర్ లడర్లను త్వరలో కలిసి, తమ సమస్యలను రాబోయే అసెంబ్లి ఎన్నికల్లో వారి మేనిఫెస్టోలో పొందుపరచాలని కోరనున్నట్లు తెలిపారు. తమ సమస్యల పరిష్కారినికి కృషి చేసే రాజకీయ పార్టీకి రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు తెలుపుతామన్నారు. విద్యా వంతులు, యువత రాజకీయాల్లోకి రావాలన్నారు. విద్యా హక్కు చట్టం ప్రకారం ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు 25 శాతం ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వాలని, ప్రారంభించి 15 సంవత్సరాలు దాటిన అన్ని ప్రైవేట్ విద్యా సంస్థలకు శాశ్వత ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలని కోరారు. విద్యార్థులను పాఠశాలకు తరలించే బస్సులకు టోల్ గేట్‌లలో మినహాయింపు ఇవ్వాలని, సేవా దృక్పథంతో పనిచేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల కరెంటు మీటర్లను ఏవడ కేటగిరికి మార్చాలని అన్నారు. ప్రైవేట్ విద్యా సంస్థలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలన్నారు. తక్కువ ఫీజుతో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో ప్రైవేట్ విద్యా సంస్థల మనుగడ ప్రశ్నార్ధకంగా మారు తుందన్నారు. రాబోయే ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో ప్రైవేట్ విద్యాసంస్థల నుంచి అభ్యర్థిని పోటీలో ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీ టు పీజీ ప్రైవేట్ విద్యాసంస్థల జేఏసి నాయకులు ఉస్మాన్ పాషా, దామెర్ల సిద్దయ్య, సబిహ సుల్తానా, తిరుపతి రెడ్డి, గోపతి సత్తయ్య, శ్రీధర్, మోహన్ వర్మ, విక్రమ్ రావు, శేఖర్, ఉపాధ్యాయులు వేణు, చిరంజీవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

బెల్లంపల్లి, ప్రభాతవార్త

బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులలో ఆంగ్ల మాధ్యమంలో బోధించే గెస్ట్ లెక్చరర్లుగా పనిచేయుటకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ సాయ ంత్రం 4 గంటలలోగా కళాశాలలో దరఖాస్తు చేసు కోవాలని ప్రిన్సిపాల్ మేకల గోపాల్ తెలిపారు. కళాశాలలో ఆంగ్లము -2, తెలుగు-2, కామర్స-1, కంప్యూ టర్ -2, మ్యాథ్స్-1, పొలిటికల్ సైన్స్-1, పోస్టులు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. సంబంధిత సబ్జెక్టులో నెట్/స్లెట్/సెట్/పీహెచ్‌డి అర్హత ఉన్నవారకి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. అలాగే పీజీలో 55 మార్కులతో ఉత్తీర్ణులై, డిగ్రీ స్థాయిలో బోధన అనుభవం ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 26వ తేదీన ఉదయం 10 గంటల నుంచి కళాశాలలో డెమో, ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులు నిజ ధ్రువీకరణ పత్రాలతో హాజరుకావాలని ప్రిన్సిపాల్ గోపాల్ సూచించారు.



# మంచిర్యాల నియోజకవర్గంలో మళ్లీ గులాబి జెండా ఎగరాలి

**-బిఆర్ఎస్ నాయకులు విజిత్ కుమార్**

దండేపల్లి, ప్రభాతవార్త



రానున్న ఎన్నికల్లో మంచిర్యాల నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరాలని మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే తనయుడు నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బిఆర్ఎస్ నాయకులు నడిపెల్లి విజిత్ కుమార్ అన్నారు. దండేపల్లి మండలంలోని చింతపల్లి గ్రామంలో బుధవారం ఇంటింటికి బిఆర్ఎస్ పార్టీ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు అందుతూన్నయా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన ఘనత బిఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ కోసం కష్టపడి పనిచేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా కృషి చేయాలన్నారు. సీఎం కేసిఆర్ హాయాంలో పల్లెలో జరిగిన అభివృద్ధిని గ్రామస్థులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, రైతు బంధు జిల్లా కో ఆర్డినేటర్ మోటపలుకుల గురవయ్య, బిఆర్ఎస్ మండల అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, ఉపసర్పంచ్ అక్కల తిరుపతి, మాజీ ఉపసర్పంచ్ గొర్ల మధుకర్, బిఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కల రాజన్న, నాయకులు కట్ల మల్లేష్, గడ్డం సుధాకర్, అక్కల సత్తయ్య, అక్కల గోపాల్, రెగుల రాయలింగు, చుంచు చందు, లింగాల వెంకటేష్, పెర్క తిరుపతి, ముద్దసాని సంతోష్, అల్చెట్టి నరేష్, మాలవత్ అశోక్, కలిమెల సుధీర్, ఆకుల శ్రీకాంత్, చెల్ల రవి, తాడురి రమేష్, లింగాల కాంతయ్య, గోపు రవి, తదితరులు పాల్గొన్నారు.

## పోయిన మొబైల్ దొరికింది

రామకృష్ణాపూర్, ప్రభాతవార్త

సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోయిన మొబైల్‌ని గుర్తించారు. పట్టణంలోని నాగార్జున కాలనీకి చెందిన పెరుగు రాజశేఖర్, అలాగే మందమర్రికి చెందిన గోమాషా జయంత్ కుమార్ అని ఇద్దరు వ్యక్తులు గత నెల క్రితం వారి ఫోన్లను పోగొట్టుకున్నారు. అనం తరం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ బి. అశోక్ సిఈ ఐఆర్ పోర్టల్ ద్వారా రెండు మొబైల్స్‌ని గుర్తించి మంగళవారం నాడు బాధి తులకు అప్పగించాడు. పోయిన మొబైల్ దొరకడంతో బాధి తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ ఓంకార్ పాల్గొ న్నారు.



## బాలికలు అప్రమత్తంగా ఉండాలి

**-షీ టీం ఇంచార్జి ఓబులమ్మ**

జన్నారం, ప్రభాతవార్త



బాలికలు చాలా అప్ర మత్తంగా ఉండాలని మంచి ర్యాల జిల్లా షీ టీం ఇంచార్జి యన్. ఓబులమ్మ అన్నా రు. మండలంలోని కల మడుగు గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక ఎస్సై సతీష్ సూచనల మేరకు బుధవారం రోజున పాఠశాల ప్రధానోపాధ్యాయులు జాడి ప్రభాకర్ ఆధ్వర్యంలో షీ టీం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులమ్మ మాట్లాడుతూ చరవాణి, ఫేస్‌బుక్, వాట్సప్‌లకు దూరంగా ఉండాలని తెలియజేస్తూ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్స్ వచ్చినట్లయితే మొదటగా వారి తల్లిదండ్రులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా ఈ వయసులో ఏది చూసినా అందంగా కనబడుతుందని వాటి ప్రభావాలకు లోను కాకుండా జాగ్రత్తగా ఉండాలని తెలుపుతూ, బాలికలపై ఎటువంటి ఇబ్బందులు వచ్చినా షీ టీమ్స్‌కి తెలియజేయాలని, ప్రభుత్వం బాలికల రక్షణ కోసం మహిళల కోసమే షీ టీమ్స్‌ని ఏర్పాటు చేసిందని ఏటువంటి ఇబ్బందులు ఎదురైనా 6303923700 నంబర్‌కి ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్సై రాథోడ్ సురేష్, కానిస్టేబుల్ జ్యోతి, చంద్రమౌళి, వెంకటేశం, పాఠశాల ఉపాధ్యాయులు కట్ట రాజమౌళి, ఎం.రమేష్, డి.లక్ష్మి, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై తక్షణమే స్పందించాలి

**ఆసిఫాబాద్ రూరల్ ,ప్రభాతవార్త :**

గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం తక్షణమే స్పందించాలని నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సమస్యలు పరిష్కారానికి గత 14 రోజుల నుండి సమ్మె చేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్మికుల యొక్క న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని, లేనియెడల కార్మికులతో పాటు మేము కూడా పోరాటంలో పాల్గొంటామని చెప్పారు. అతి తక్కువ వేతనంతోనే పనిచేసే గ్రామ పంచాయతీ కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి సరస్వతి, ఎమ్మార్పిఎస్ జాతీయ ఉపాధ్యాక్షుడు కేశవరావు మాదిగ, కేవీపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, బీఎస్పి పార్టీ నాయకులు భూక్యా రాజు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిసెల కార్తిక్, సీపీఐఎంఎల్ పార్టీ రెడ్ స్టార్ తిరుపతి, బీసి సంక్షేమ సంఘం రైతు అధ్యక్షుడు మారుతి, టీపీజీఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలశ్రీ, సీఐటియూ జిల్లా కార్యదర్శి రాజేందర్, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి శ్రీకాంత్, నాయకులు సమ్మయ్య రాజు, నగేష్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## వంజిరి రైతు వేదికలో రైతుభీమా దరఖాస్తుల స్వీకరణ

**కాగజ్‌నగర్ రూరల్ ,ప్రభాతవార్త :**

కాగజ్‌నగర్ మండలంలోని వంజరి రైతు వేదికలో బుధవారం రైతు భీమా దరఖాస్తులను రైతుల నుండి ఏఈఓ సృజన స్వీకరించారు. ఈ సందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ రైతు భీమా పథకంలో పేర్లను ఆగస్టు 5 వతేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. పట్టాపాసు పుస్తకాలు ఉండి రైతు భీమా పథకంలో పేర్లు నమోదు చేసుకోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వంజరి గ్రామ పంచాయతీ పరిధిలో ఇంకా 35 మంది రైతులు రైతుభీమా చేసుకోలేదని జూన్ 18లోపు పట్టా పాసుపుస్తకాలు పొందిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 18 నుండి 59 ఏళ్ల వయసు గల రైతులు భీమకు అర్హులు అని ఆధార్‌కార్డును ప్రామాణికంగా తీసుకొని వయసును లెక్కిస్తారని ఎన్నికోట్ల ఎంత భూమి ఉన్నా ఒక చోటులో ఉన్న భూమి ద్వారా మాత్రమే భీమా పథకంలో పేరు నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, నామిని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా వివరాలను స్వయంగా వచ్చి సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వంజిరి గ్రామ సర్పంచ్ ముంజం రమేష్, రైతులు పాల్గొన్నారు.



## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోనేరు కోనప్ప

**కాగజ్‌నగర్ ,ప్రభాతవార్త :**



హజ్రత్ ఖాజామోయినుద్దీన్ హాష్మీ సాబ్ ప్రతీ సంవత్సరం మొహరం ఒకటవ తేదిన సందల్ ఉత్సవాలు, రెండవ రోజు ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ ఉర్సు ఉత్సవాల్లో భక్తులు హైదరాబాద్, నిజామా బాద్, ఆరిఫ్‌నగర్ నుండి అధిక సంఖ్యలో వచ్చి పతాకావిష్కరణ చేసి ఉత్సవాల్లో పాల్గొంటారు. ప్రతీ సంవత్సరం నిర్వహించే ఉర్సు ఉత్సవాల్లో భాగంగా బుధవారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఇర్ఫాన్‌నగర్‌లో హజ్రత్ ఖాజామోయినుద్దీన్ హాష్మీసాబ్ దర్గాలో సిర్పూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్గాలో చాదర్ సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, బీఆర్ఎస్ నాయకులు నియాజోద్దీన్ బాబా, మహబూబ్, అజ్మీర్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు హబీబ్, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అబ్దుల్ సుభాన్, మత గురువులు, మత పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కోనేరు వంశీ జన్మదిన వేడుకలు

**కాగజ్‌నగర్ ,ప్రభాతవార్త :**



కోనేరుచారిటబుల్ ట్రస్టు చైర్మన్ కోనేరు వంశీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వార్డు కౌన్సిలర్లు, కోనేరు ట్రస్టు సభ్యులు, కోనేరు అభిమానులు అన్నదాన సత్రంలో, సర్‌సిల్క్‌లో, ఆయా వార్డుల్లో కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కోనేరు అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థుల ఎదుగుదలకు సమగ్ర చర్యలు చేపట్టాలి

**ఆసిఫాబాద్ రూరల్ ,ప్రభాతవార్త :**



విద్యార్థుల ఎదుగుదలకు ఉపాధ్యాయులు సమగ్ర చర్యలు చేపట్టాలని ఎంపీపీ మల్లికార్జున్ తెలిపారు. బుధవారం మండలంలోని మోవాడ్ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలను తెలుసుకొని పాఠశాలలో భోజన వసతి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు నూతన విధానాలు అమలు చేయాలని అన్నారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. రాష్ట్రంలో ఎక్కడ లేని విధంగా గురుకులాల నిర్వహణ జరుగుతుందని అన్నారు.

**హరితహారం కార్యక్రమం...**

మండలంలోని మోవాడ్ , అడదస్నాపూర్, వావుదం, తదితర ప్రాంతాల్లో బుధవారం ఏర్పాటు చేసిన హరితహారం కార్యక్రమంలో పాల్గొని ఎంపిపి మల్లికార్జున్ మొక్కలు నాటారు. ప్రతీ ఒక్కరు బాధ్యతగా తీసుకొని మొక్కలు పెంచాలని అన్నారు. పర్యావరణకు తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసిలు లింగు, సత్రవేణి, సావిత్రి, మల్లేష్, ఎంపిడిఓ శశికళ, ఎంపీఓ చంద్రశేఖర్, సర్పంచ్‌లు కిషన్‌రావు, లింగు, నాయకులు బదుపటేల్, ఫారెస్టు సిబ్బంది పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు భీమా దరఖాస్తుల స్వీకరణ

**దహెగాం ,ప్రభాతవార్త :**

దహెగాం మండలం ఈటపల్లి గ్రామంలో బుధవారం ఏఈఓ సుష్మిత రైతుల నుండి రైతు భీమా దరఖాస్తులను స్వీకరించారు. ఈసందర్భంగా ఏఈఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు రైతు భీమా దరఖాస్తులు చేసుకోని రైతులు కొత్తగా పట్టాదారు అయిన రైతులు అందరూ దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. పట్టాదారు మరణిస్తే నామినికి ప్రభుత్వం నుండి 5 లక్షల భీమా పొందుతారని అన్నారు. జూన్ 18వ తేదీ వరకు డిజిటల్ సైన్ అయిన కొత్త పట్టాదారు రైతుల భీమా అర్హులని , రైతుల భీమా దరఖాస్తు చేసుకోవాలని , ఇదివరకే దరఖాస్తు చేసుకొన్న రైతులు ఆధార్ కార్డు మార్పు చేసి క్లస్టర్ ఏఈఓను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

# కుమురంభీం ఆసిఫాబాద్ వార్త

## తహసీల్దార్ ముందు ఇద్దరిని బైండోవర్

**సిర్పూర్(టి) ప్రభాతవార్త :** సిర్పూర్ (టి) తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రోజున ఎక్సైస్ సీఐ మంగమ్మ, ఎస్సై కిషన్ సిర్పూర్ గ్రామానికి ఆసిఫ్ సాయి ఇద్దరిని తహసీల్దార్ రియాజ్ అలీ ముందు బైండోవర్ చేశారు. మంగళవారం రోజున వెంకటరావు పేట్ గ్రామ వద్ద ముందస్తు సమాచారం మేరకు వాహనాల తనిఖీ చేయగా 300 కేజీల పటిక ఆటోలో తరలిస్తున్నట్లు సీఐ మంగమ్మ తెలుపుతూ ఇద్దరిపై కేసు నమోదు చేసి ఆటో సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఈ దాడిలో సీఐ మంగమ్మ, ఎస్ఐ కిషన్ , సిబ్బంది మల్లేష్, వెంకటేష్, సతీష్, లింగయ్య, సిబ్బంది ఉన్నారు.



## అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**... జిల్లా వ్యాప్తంగా 61 పోస్టుల భర్తీ**

**ఆసిఫాబాద్ రూరల్ ,ప్రభాతవార్త :** జిల్లాలోని 11 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 61 అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మాధ్యమిక విద్యాధికారి శ్రీధర్ సుమన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం ప్రభుత్వం ఇంటర్మీడియెట్ కమీషనర్ ఆదేశాల మేరకు దరఖాస్తుదారులను ఈనెల 24 వరకు అన్ని పని దినాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా కళాశాల్లో ఉన్న జనరల్ జబ్జెక్టులకు గాను పీజీలో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత కలిగిన వారు అర్హులని, అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ, పిజీ, ధృవపత్రాల జిరాక్స్ కాపీలను జతచేస్తూ జిల్లా ఇంటర్ విద్య అధికారి కార్యాలయంలో సమర్పించాలని తెలిపారు. జైనూర్‌లో -5, కాగజ్‌నగర్‌లో -16, సిర్పూర్‌లో -4, కౌటాలలో -4, బెజ్జూర్‌లో -6, తిర్యాణిఒల -3, దహెగాంలో -5, ఆసిఫాబాద్‌లో -6, కెరమెరిలో -4, వాంకిడిలో -4, రెబ్బెన కళాశాలలో -4 ఖాళీలు ఉన్నాయని తెలిపారు. అభ్యర్థుల మెరిట్ ఆధారంగా అతిథి అధ్యాపకుల ఎంపిక ప్రక్రియ ఉంటుందని, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జాయింట్ కలెక్టర్, ప్రిన్సిపల్ సభ్యులుగా ఎంపిక నిర్వహించబుతుందని అన్నారు.

## మా చేపలు మాకు దక్కనివ్వండి

**... చేపల దొంగలపై చర్యలు తీసుకోండి**

**పెంచికల్‌పేట్ ప్రభాతవార్త :** పెంచికల్‌పేట్ మండలంలోని చేద్వాయి గ్రామానికి చెందిన వంశపారంపర్య (గంగపుత్రులు) మా గ్రామ శివారు పరిధిలోని ఉచ్చమల్ల జలాశయంలో దరొగపల్లికి చెందిన కొత మంది వారం రోజుల నుండి దొంగ తనంగా చేపలు పడుతున్నారని తెలిసింది. ఈ రోజు ఉదయం మా సంఘ సభ్యులు కాపలా వెళ్లి చూడగా మమ్ములను చూసి 4 వలలు, ట్యూబ్ మరియు పట్టిన చేపలను వదిలిపెట్టి దొంగలు అడవిలోకి వెళ్లినారు. పోతు పోతు మీ సంగతి చూస్తాం అంటూ బెదిరిస్తూ పారిపోయారు. ఇంతకు ముందు ఇలా చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. అయినప్పటికి వాళ్లు మారవడం లేదు. ఈ రోజు కూడా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది. ఉన్నతాధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు బోరియే సోమన్న, సభ్యులు పాల్గొన్నారు.



ఆదిలాబాద్ వార్త

# బెల్టు షాపులను తొలగించాలి




**ఇంద్రవెల్లి, ప్రభాతవార్త:**
మద్యం బెల్టుషాపులను వెంటనే తొలగించి నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు సోన్ కాంబ్లే మనోహర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి విద్యకు దూరమవుతున్నారన్నారు. చదువుకునే సమయంలో మద్యం మత్తులో యువత అలవాటు పడి రోడ్డు ఆక్సిడెంట్‌లో మరణిస్తున్నారాన్నరు. మండల కేంద్రంలోని పలు కాలనీలో మద్యం విక్రయాలు కొనసాగుతున్నాయని, వాటిని అడ్డుకోవడాలని రాష్ట్ర, జిల్లా అధికారులు, ఎక్సైజ్, పోలీసులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఈకార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వాఘ్మారే కామరాజ్, గౌరవాధ్యక్షులు కాంబ్లే మారుతి, కోశాధికారి కాంబ్లే సునీల్, ఆదివాసీ మహిళ సంఘం నాయకురాలు కోవా కోసుబాయి, ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు కోవా వినోద్‌కుమార్, బీం ఆర్మీ ఖానాపూర్ నియోజక వర్గ అధ్యక్షులు ఫరత్ వాగ్ దత్త, మానవ హక్కుల వేదిక జిల్లా అధ్యక్షుడు కాంబ్లే అతిష్, ఉపాధ్యక్షులు బాలేరావు భాస్కర్, సభ్యులు సోన్ కాంబ్లే సూరజ్ పాల్గొన్నారు.

# తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా అభినందనీయం

## -మాలీ జాతీయ సమ్మేళనంలో ఏకగ్రీవ తీర్మానం




**ఆదిలాబాద్, ప్రభాతవార్త:**
అన్ని రంగాల్లో వెనుకబడ్డ తెలంగాణ మాలీలకు ఎస్టీ హోదా కల్పించడం చారిత్రక అవసరమని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయం అభినందనీయమని, ఇక కేంద్ర ప్రభుత్వం ఆలస్యం చేయకుండా వెంటనే మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని మాలీ జాతీయ సదస్సులో ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. ఈసందర్భంగా అఖిల భారతీయ మాలీ మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ పేటక్కులే అఖిల భారతీయ మాలీ మహా సంఘం 22వ స్థాపన దినోత్సవం పురస్కరించుకొని నాసిక్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతూ జాతీయ స్థాయి నేతలంతా ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాన్ని సమర్థించడం హర్షించదగ్గ విషయమని, వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని కోరారు. ఏకగ్రీవ తీర్మానం చేసిన జాతీయ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సంబాజీ పగారే, ప్రముఖ పారిశ్రామికవేత్త డీకే మాలీ, మానవ హక్కుల సంఘం జాతీయ అధ్యక్షులు శివదాస్ మహాజన్, డాక్టర్ పూలే సూరత్, తెలంగాణ నుండి సంఘ కార్యకర్తలు సుభాష్ షిండే, మురళీధర్ నాగోపి, గజానంద్ చౌదరి, ధనంజయ్, ప్రదాన్, కల్పన పెట్కులే పాల్గొన్నారు.

## బరంపూర్‌గా మండలంగా ఏర్పాటు చేయాలి



**ఆదిలాబాద్, ప్రభాతవార్త:**
తలమడుగు మండలంలోని ప్రజల కోరిక మేరకు బరంపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని మాజీ జడ్పీటీసీ సభ్యులు బొల్లారావు బాబన్న అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రాహుల్ రాజ్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. మండలంలో 40వేల జనాభా ఉండగా మా ప్రాంతంలో 20వేల జనాభా కలిఇ ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన జనాభా అధికంగా ఉన్నప్పటికీ ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. ప్రభుత్వ పాలన ప్రజలకు చేరువ కావాలంటే బరంపూర్‌ను మండలంగా ఏర్పాటు చేయాలని విన్నవించారు. చిన్న మండలాల ఏర్పాటుకు ప్రభుత్వం కూడా సుముఖంగా ఉన్నందున ప్రజల విన్నపాన్ని ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో మేకల మధుకట్, పెందూర్ దివ్య మాదవ్; ఎంపీటీసీ కజ్జర్ల గోదావరి కమలాకర్, కళ్యాం రమేశ్ రెడ్డి, సోమన్న, ఎంపీటీసీ సర్పంచు నారు కిష్టన్న, అర్లి సర్పంచ్ మలుకు సర్పంచ్ అబ్దుల్లా సర్పంచ్, సి. రమేశ్‌రెడ్డి ఎంపీటీసీ, ఎ. నారాయణరెడ్డి ఉప సర్పంచ్, బరంపూర్ వై. శ్రీనివాస్‌రెడ్డి, చర్లపల్లి శాస్త్రి మాజీ ఎంపీటీసీ పాల్గొన్నారు.

## రెవెన్యూ డివిజన్ చేయాలని ఎమ్మెల్యేకు వినతి



**బోథ్, ప్రభాతవార్త:**
మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని సాధన సమితి సభ్యులు బుధవారం ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆదిలాబాద్ తన నివాసంలో కలిసి మండలాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని వినతి పత్రాన్ని అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే 2022లోని కలెక్టర్ ద్వారా సీసీఎల్ఏకి ప్రతిపాదనలు పంపడం జరిగిందని రెవెన్యూ డివిజన్ ప్రభుత్వం దృష్టిలో ఉందని తెలిపారు.

## కాంగ్రెస్‌లో చేరిన తుల అరుణ్



**బోథ్, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధిష్టాన ముఖ్య నాయకుల సమక్షంలో సామాజిక సేవకుడు నూతన సోనాల మండలానికి చెందిన తుల అరుణ్ కాంగ్రెస్ పార్టీలో బుధవారం చేరినట్లు ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు బజార్‌హత్నూర్ జడ్పీటీసీ, ఎంపీటీసీ ఆయా మండలాల నాయకులు తదితరులు ఉన్నారు.

## రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు మద్దతుగా వార్డు మెంబర్ రాజీనామా



**బోథ్, ప్రభాతవార్త:**
బోథ్ మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని గత మూడు రోజుల నుంచి రిలే దీక్షలు చేపట్టిన మండల వాసులకు మద్దతుగా మర్లపల్లి గ్రామానికి చెందిన కట్ట శిరీష అనే మహిళ బుధవారం తన పదవీకి రాజీనామా చేస్తున్నట్లు స్థానిక ఎంపీఓ జీవన్‌రెడ్డికి తన రాజీనామా పత్రాన్ని అందించారు.

## అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

### - జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్



**ఇంద్రవెల్లి, ప్రభాతవార్త:**
మండలంలోని ముత్నూర్ గ్రామాన్ని స్వచ్ఛ సర్వేక్షన్ 2023 అవార్డులో భాగంగా కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి గడువులోగా పూర్తి చేయాలని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి సందర్శించి ముందుగా అధికారులు, గ్రామస్తులతో సమావేశమై జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను తెలుసుకున్నారు. అనంతరం గ్రామాన్ని సందర్శించి కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 2023 అవార్డులో భాగంగా గ్రామంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులకు ముత్నూర్ గ్రామస్తులు అధికారులకు సహకరించి అవార్డు వచ్చేలా కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో జడ్పీ డీఆర్‌డీఓ కిషన్, సర్పంచ్ తంరం బాగుబాయి, బీఆర్ఎస్‌పార్టీ నాయకులు కనక తుకారాం, మర్సుకోల తిరుపతి, ఎండి జునైద్ పాల్గొన్నారు.

## 23న ఆదివాసీ తొమ్మిది తెగల ఆత్మీయ సమావేశం



**ఇంద్రవెల్లి, ప్రభాతవార్త:**
ఆదివాసీ గిరిజనులను 9 తెగల ఐక్యతపై ఈనెల 23న కేస్లాపూర్ నాగోబా దర్బార్ హాల్‌లో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ గిరిజన సమన్వయ కమిటీ అధ్యక్షుడు సిడాం భీంరావు పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశానికి ఉమ్మడి జిల్లా నుంచి ఆదివాసీ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశానికి తొమ్మిది తెగల ఆదివాసీలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈసమావేశంలో ఆదివాసీ సంఘాల నాయకులు మెస్రం వెంకట్‌రావు పటేల్, అర్కా ఖమ్ము, తొడసం నాగోరావు, మెస్రం నాగనాథ్, తొడసం సాగర్ పాల్గొన్నారు.

## వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### - కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్

*వేములవాడ, ప్రభాతవార్త :*

వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కా ంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఆది శ్రీనివాస్ అన్నారు. వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణశాఖ చెబుతున్న నేపథ్యంలో ప్రజలు, రైతులు జాగ్రత్తలు పాటించాలని, అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దన్నారు. రైతులు విద్యుత్ ట్రానా న్స్ఫర్మర్లు, విద్యుత్ వైర్లు ముట్టుకోవద్దన్నారు. వర్షం పడడంతో చిన్న పిల్లలు సరదాగా ఆట ఆడడానికి బయటకు వెళ్తారని తల్లిదండ్రులు పిల్లల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. చెరువులలో చేపలు పట్టే



మత స్యకారులు జాగ్రత్తగా ఉండా లన్నారు. వర్షాకాలంలో వాహనాలు వెళ్లే సమయంలో జారి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వెళ్లడంతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. ఉరు ములు, మెరుపులు వచ్చే సమయంలో చెట్ల వద్ద ఉండరాదని, పాత ఇల్లు, శిథిలావస్థలో ఉన్నవారు జాగ్రత్తలు తీసుకొని సురక్షిత ప్రాంతాలకు చేరు కోవాలన్నారు. అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ జిల్లా కలెక్టర్ వెంటనే హెల్ప్‌లైన్ నెంబర్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేయాలన్నారు.

## భారీ వర్షానికి పారుతున్న నక్క వాగు

**తంగళపల్లి, ప్రభాతవార్త :** గత రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న



వర్షానికి తంగళపల్లి మండలంలోని గండిలచ్చపేట వద్ద నక్కవాగు పారుతుంది. భారీ వర్షానికి నక్క వాగు ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

## యాదవ సంఘం అధ్యక్షునిగా ఆసరి బాలరాజు యాదవ్

*తంగళపల్లి, ప్రభాతవార్త :*

తంగళపల్లి మండలం జిల్లెల్ల గ్రామ రాధాకృష్ణ యాదవ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఆసరి బాలరాజు యాదవ్, ఉపాధ్యక్షులుగా ఉడుతల నరేందర్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా కోతపెల్లి శ్రీనివాస్ యాదవ్, క్యాషియర్ ఉడుతల శ్రీనివాస్ యాదవ్, జనరల్ సెక్రటరీ బొడ రాజు యాదవ్, ముఖ్య సలహాదారులుగా చౌదవేని వెంకటి యాదవ్, దుగ్యాని పర్శరాములు యాదవ్, గుండెల్లి నర్సయ్య యాదవ్, నూకల లచ్చయ్యా యాదవ్, ఉడుతల బుచ్చయ్య యాదవ్‌లు నియామకమయ్యారు. ఈ సందర్భంగా బాలరాజు యాదవ్ మాట్లాడుతూ యాదవ సంఘం అభివృద్ధికి బలోపేతానికి కృషిచేస్తానని పేర్కొన్నారు. సంఘం అధ్యక్షులుగా ఎన్నుకున్న గ్రామ యాదవ సంఘం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం సభ్యులు, యాదవ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడలో పిచ్చికుక్క స్వైర విహారం

### - దాదాపు 30 మందికి గాయాలు

*వేములవాడ, ప్రభాతవార్త :*

వేములవాడ పట్టణంలో పిచ్చికుక్క స్వైర విహారం చేయడంతో దాదాపు 30 మందికి గాయాలు కాగా ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పిచ్చి కుక్క దాడితో పట్టణవాసులు భయాందోళనకు గురయ్యారు. పట్టణం లోని సుభాష్‌నగర్, రాంమందిర్‌వీధి, టెంపుల్ ఏరియా, పాత కూరగాయల మార్కెట్ ఏరియా, గాంధీనగర్‌లో కుక్క దాడిచేసినట్లు సమాచారం. వీధికుక్కల స్వైరవిహారాన్ని ఆపడంలో అధికారులు విఫలమయ్యారంటూ మున్సిపల్ అధికారులపై పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా స్థానికులు పిచ్చికుక్కను చంపినట్లు తెలిసింది.

## పేకాటరాయుళ్ల అరెస్ట్

*వేములవాడ, ప్రభాతవార్త :*



వేములవాడ పట్టణంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పట్టణంలోని మొదటి బైపాస్ రోడ్డులో గల భవాని లాడ్జీలో పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో డీఎస్పీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేసి పేకాట ఆడుతున్నవారిని పట్టు కున్నారు. వారి వద్ద నుండి 86 వేల 340 నగదు స్వాధీనం చేసు కున్నారు. సంకినేని దేవేందర్‌రావు, సల్ల భిక్షపతి, బీగాల అనిల్, నమిలికొండ నర్సయ్య, లింగంపెల్లి అశోక్, సందవేని భాస్కర్, బొల్లవేని తిరుపతి, లాడ్జి ఓనర్ సాన అంజిరెడ్డిలపై కేసు నమోదు చేశారు.

## ఎరువుల దుకాణంలో దొంగతనానికి యత్నం

*వేములవాడ, ప్రభాతవార్త :*

వేములవాడ పట్టణంలోని కోరుట్ల బస్టాండ్ ఏరియాలోని గ్రోమోర్ దుకాణంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి యత్నించారు. ఎరువుల దుకాణంలో దొంగతనానికి విఫలయత్నం విషయం తెలుసుకున్న పోలీసులు డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

## టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావును ఘనంగా సత్కరించిన బిఆర్ఎస్ నేతలు

*తంగళపల్లి, ప్రభాతవార్త :*



సిరిసిల్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు అమెరికా పర్యటన విజయవంతంగా పూర్తిచేసుకొని స్వదేశానికి వచ్చిన సందర్భంగా తంగళపల్లి మండల నాయకులు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా అధ్య క్షులు తోట ఆగయ్య, మండల పార్టీ అధ్యక్షులు గజబింకార్ రాజన్న, ప్యాక్స్ చైర్మన్ బండి దేవదాస్‌గౌడ్, వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకట రమణారెడ్డి, ఎంపిటిసి కోడి అంతయ్య, మాజీ ఏఎంసి చైర్మన్ సింగిరెడ్డి రవీందర్‌రెడ్డి, పబ్బతి విజయేందర్‌రెడ్డి, పూసపెల్లి సరస్వతి, ఏసిరెడ్డి రామ్‌రెడ్డి, ఆర్కుటి మహేష్ యాదవ్, కూర్మ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలి

### - బ్యాంకు మేనేజర్ భానుమూర్తి

*చందుర్తి, ప్రభాతవార్త :*



తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసు కోవాలని చందుర్తి తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ భానుమూర్తి అన్నారు. బుధవారం చందుర్తి బ్యాంకులో ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా చందుర్తిలో తెలంగాణ గ్రామీణ బ్యాంకు వినియోగ దారులకు సేవలు అంది స్తున్నారు. ఇప్పటి వరకు బ్యాంకులో 9 కోట్ల వ్యాపారం జరుగుతుందని, రైతులకు వ్యవసాయ రుణాలు, రైతునేస్తం రుణాలు, మహిళలకు రుణాలు అందివ్వడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా రెండు రకాల డిపాజిట్లు ఉన్నాయని 399 రోజులు కామధేనువు పథకం, 599 రోజులు కల్ప తరువు పథకం కింద డిపాజిట్ చెల్లిస్తే 7.15 వడ్డీ లభించడం జరుగుతుందన్నారు. 456 రూపాయలు ప్రధాని జీవనజ్యోతి సురక్ష పథకం కింద డబ్బులు చెల్లిస్తే ప్రమాద భీమా వర్తిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ ఆధార్ కార్డును అప్డేషన్ చేసుకోవాలన్నారు. ప్రతిఒక్కరూ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని కోరారు.

## బురదమయంగా పాఠశాల రహదారి

*చందుర్తి, ప్రభాతవార్త :*

చందుర్తి మండల ఏంద్రంలో కస్తూర్బా పాఠశాలకు వెళ్లే రహదారి బురద మయంగా మారడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థినులు బురద నుండి వెళ్లడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారిని నిర్మించాలని పలుమార్లు ప్రజాప్రతినిధులను అధికారులను కోరినా పట్టించుకోవడం లేదని విద్యార్థులు తెలిపారు. ఇప్పటికైనా బురదమయంగా మారిన రహదారికి మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు ఉపాధ్యాయులు కోరుతున్నారు. అలాగే ఈ రహదారిలో వీధి దీపాలు లేకపోవడంతో రాత్రిపూట పనిచేసే సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

## అనాథ కుటుంబానికి చల్మెడ చేయూత

*చందుర్తి, ప్రభాతవార్త :*

చందుర్తి మండలం కిష్టంపేట గ్రామానికి చెందిన పొలాస లత-శ్రీనివాస్ ఇద్దరూ అనారోగ్యంతో కిందగా వీరి ఇద్దరు కవల పిల్లలు వివేక్, సిద్దార్థలు అనాథగా మారడంతో అమ్మమ్మ దేవేంద్ర అన్ని తానై పోషించడంతో



విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు, చల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ అధినేత చల్మెడ లక్ష్మీనరసింహారావు బుధవారం బాధిత కుటుం బాన్ని పరామర్శించి రూపాయలు 10 వేల ఆర్థికసాయం అందించారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నప్పటికీ వర్షంలో కూడా లక్ష్మీ నరసింహారావు కిష్టంపేట గ్రామాన్ని సందర్శించి అనాథ కుటుంబానికి ఆర్థిక సాయం అందజేయడంతో గ్రామస్తులు లక్ష్మీనరసింహారావును అభినందించారు. ఈ కార్యక్రమంలో ననుగుల సింగిల్విండో చైర్మన్ జలగం కిషన్‌రావు, నాయకులు గోపాల్, సత్తయ్య, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

*రుద్రంగి, ప్రభాతవార్త :*



వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పరిస రాలను పరిశుభ్రంగా ఉంచు కోవాలని వైద్య సిబ్బంది సూచిం చారు. స్వచ్ఛ సర్వేక్షన్ లో భాగంగా క్లోరినేషన్‌పై ఇంటింటా తిరుగుతూ గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నీటి కుండీల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచకూడదన్నారు. ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచితే దోమలు పెరిగే అవకాశం ఉంటుందని వాటిని సమూలంగా నాశనం చేయ దానికి మురికి వాడల్లో ఎక్కువ రోజులు నిల్వ ఉంచిన కుండీల్లో కిరోసిన్ పోయాలని తెలిపారు. దోమలతో మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాలాంటి జ్వరాలు వస్తాయన్నారు. ఇండ్లముందు నిరుపయోగంగా నీటి కుంటలను మూసివేయాలని, నిల్వ ఉంచిన యజమానులతో పారబోయించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం రాజేశ్వరి, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బందితో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 21న ఏరియా ఆసుపత్రిలో ఫ్యామిలీ ప్లానింగ్ క్యాంపు...

**వేములవాడ, ప్రభాతవార్త :** వేములవాడ ప్రాంతీయ ఆసుపత్రిలో ఈ నెల 21వ తేదీ శుక్రవారం రోజున ఫ్యామిలీ ప్లానింగ్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు మెడికల్ సూపరింటెంట్ మహేష్‌రావు తెలిపారు. ఈ క్యాంపులో మగవారికి మాత్రమే ఫ్యామిలీ ప్లానింగ్ ఆపరేషన్ చేస్తారని తెలిపారు. ఆపరేషన్ చేయించుకునేవారు ముందుగా ఆసుపత్రిలో ఎమర్జెన్సీ బ్లాక్ దగ్గర రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

# పోడు భూములకు పట్టాలు ఇవ్వకుంటే తిరుగుబాటు తప్పదు

ఇంద్రవెల్లి, ప్రభాతవార్త:

ఆదివాసీ గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూము లకు పట్టాలివ్వాలని, లేకుంటే తిరుగు బాటు తప్పదని ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి పుర్క బాపురావు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని స్థానిక ఎంపీడీఓ కార్యాల యాన్ని సందర్శించి స్థానిక ఎంపీడీఓ పుష్పలతకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని దోడందా గ్రామంలోని 100 మంది పోడు రైతులకు ఏ ఒక్కరిని కూడా పట్టలు రాకపోవడం పై ఆందోళన వ్యక్తం చేశారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా



ఆదివాసీలను మోసం చేసిందన్నారు. ఎక్కడ ఆదివాసీలకు పూర్తిగా పోడు భూములకు పట్టాలు పంపిణీ చేయలేదని, కానీ ప్రజలకు నమ్మించే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. పోడు భూములకు సర్వే చేసి పోడు రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24న ఐటీడీఏ కార్యా లయం ఎదుట ధర్నా కార్య క్రమం చేపడు తామని హెచ్చరించారు. ఈకార్య క్రమంలో ఆదివాసీ మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పెందూర్ పుష్పరాణి, తుడుందెబ్బ జిల్లా కార్యదర్శి సోయం రాందాస్, తుంరం ధను, పెందూర్ అంకుష్; మేస్రం మురారి, పుసం కరుణ్ బాయ్, దుర్వ దేరరావు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ రైతులకు క్షమాపణ చెప్పాలి

**-ఎమ్మెల్యే దివాకర్ రావు**

దండేపల్లి, ప్రభాతవార్త

రైతులకు ఉచిత కరెంట్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి వైఖరిని నిరసిస్తూ రైతు వేదికల వద్ద రైతులతో నిర్వహిస్తున్న సమావేశాల్లో భాగంగా బుధవారం దండేపల్లి మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్



రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెలేనయ మాట్లాడుతూ ఐదు దశాబ్దాల పాలనలో వ్యవసాయాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి రైతులను గోసపెట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికి అదే పనిచేస్తుందని విమర్శించారు ఐదు దశవాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీ కరెంట్, ఎరువులు, నీళ్ల ఇవ్వకుండా ప్రాజెక్టులు కట్ట కుండా, చెరువులు బాగు చేయ కుండా వ్యవసాయాన్ని అధోగతి పాలు చేసి, రైతన్నల ఆత్మ హత్యలకు కారణమైందని ధ్వజ మెత్తారు ఇప్పటిప్పుడే కుదు పడుతున్న తెలంగాణ రైతుల కడుపులు కొట్టే విధంగా రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమ ర్శించారు. రైతులకు మూడు గంటల కరెంట్ చాలన్న వ్యాఖ్యలపై రైతులకు కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కరెంట్ పరి స్థితుల పై రైతులు గుండెల పై చేతులు వేసుకొని ఆత్మపరిశీలన చేసుకో వాలని కోరారు. ఆరు గంటల పాటు కరెంటు ఇస్తానన్న కాంగ్రెస్ ఏనాడైనా మూడు గంటల పాటైనా ఇచ్చిందా అని ప్రశ్నించారు. నాడు నాట్లు వేసే కాలం వచ్చిందంటే ఎరువుల దుకాణాల ముందు చెప్పుల వరుసలు, విత్తనాల దుకాణాల ముందు క్యూలైన్లు ఉండేవి కావా అని ప్రశ్నించారు. ఎండకాలం వచినచందంటే ఎండిన పంటలు సబ్‌స్టేషన్ల



ముందు ధర్నాలు నిత్యకృత్యమయ్యేవని గుర్తచేశారు. 2014 తర్వాత సీఎం కేసిఆర్ నేతృత్వంలో ఒకవైపు సాగునీటి ప్రాజెక్టులు, మిషన్ కాకతీయతో చెరువులను బాగుచేస్తూనే మరోవైపు రైతుబంధు వంటి విప్లవాత్మక పథకాలు అమలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతు బంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ మోటపలుకుల గురవయ్య, ఎంపీపీ గడ్డం శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పసర్తి అనిల్, సహకార సంఘం అధ్యక్షులు కసనగొట్టు లింగన్న, స్థానిక ఉపసర్పంచ్ గొట్ల భూమన్న, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు చుంచు శ్రీనివాస్, నాయకులు బొలిశెట్టి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి శంకుస్థాపన

హాజీపూర్, ప్రభాతవార్త

బిఆర్ఎస్ ప్రభుత్వం వైద్య, ఆరోగ్య రంగానికి పెద్దపీఠ వేస్తుందని ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు అన్నారు. బుధవారం హాజీపూర్ మండలం లోని ముల్కల్ల గ్రామంలో నేషనల్ హెల్త్ మిషన్ నిధుల నుంచి 20 లక్షల రూపాలయతో నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవన నిర్మాణానికి మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు అనంతరం ఆరోగ్య ఉపకేంద్రానికి ముల్కల్ల గ్రామానికి చెందిన గొనె సతీష్ రావు తన తండ్రి జ్ఞాపకర్థం 300 గజాల భూమిని విరాళంగా ఇచ్చినందుకు గాను తసీష్ రావును ఎమ్మెల్యేతో పాటు పలువురు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఉప కేంద్రాలను నిర్మిస్తామన్నారు. కార్పొరేట్ ఆసుప త్రులకి ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తుందన్నామని



తెలిపారు. సీఎం కేసిఆర్ నాయకత్వంలో అన్ని రంగాలలో అభివృద్ధి లక్షనయంగా దూసుకుపోతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణకు పెద్ద ఎత్తున నిధులు కేటాయిస్తుందని అన్నారు. వైద్యశాలలు ఏర్పాటు, వైద్యుల నియామకం సిబబనంది నియమాకాలు చేసి నిరుపేద రోగులకు మెరుగైన వైద్యం అందించడంలో ప్రభుత్వం చొరవ ఎంతో ఉందని కొనియాడారు. కొద్దీ నెలల్లో మెడికల్ కాలేజ్ సొంత భవనం పూర్తయి ఆసుపత్రి స్థాయి పెరుగుతుందని అన్నారు. ఇప్పటికే మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం, డయాగ్నోస్టిక్ సెంటర్ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. రామోయే రోజుల్లో కార్పొరేటన ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్య సేవలు అందు తాయని తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎంపీపీ మందపల్లి స్వర్ణలత-శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర విద్య, సంక్షేమ మౌలిక సదుపాయాల అఇవృద్ధి సంస్థ డిఈ శ్రీనివాస్, ఏఈ రాజేశ్వర్ రెడ్డి, మండల వైద్యధికారిణి లహరి, స్థానిక సర్పంచ్ మంచాల శ్రీనివాస్, వైస్ ఎంపీపీ బేతు రమాదేవి, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షులు పుస్కుర్ శ్రీనివాస్ రావు, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు మొగిలి శ్రీనివాస్, సర్పంచుల ఫోరమ్ మండల అధ్యక్షులు గొల్ల శ్రీనివాస్, నాయకులు రావుల వెంకటేష్, అసాది సుధాకర్, లాగిశెట్టి రాజయ్య, మల్రాజ్ సునీల్ రావు, మామిడాల మల్లేష్, జువ్వి నర్సింగ్, కిరిటీ, సోగాల కిష్టయ్య, పుదారి శంకరయ్య, అలిశెట్టి కోఠి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నుంచి బీజేపీలోకి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో చేరికలు

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :

లక్ష్మణచాంద మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు భూషణ మల్లేష్, తుర్తి రాజేశ్వర్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సమక్షంలో వారు బీజేపీలో చేరారు. వారికి ఆయన బీజేపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా



మహేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. పార్టీ బలోపే తానికి ముందుండి పోరా డాలని ప్రతీ ఒక్క కార్య కర్తకు సూచించారు.

## అన్ని వర్గాల అభివృద్ధే పరమావదిగా ముందుకు..

**-ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగురామన్న**

**- సవారి బంగ్లాలు ప్రారంభం**

ఆదిలాబాద్, ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల అభివృద్ధే పరమావదిగా ముందుకు సాగుతున్నామని, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఇక్కట్లను దూరం చేస్తున్నామని ఎమ్మెల్యే జోగురామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని రణదీవేనగర్‌లో పది లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సవారి బంగ్లాను బుధవారం ఆయన ప్రారంభించారు. ముందుగా కాలనీకి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానికులు సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి బంగ్లాను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే జోగురామన్న మాట్లాడారు. మొహరం పండగ మత సామరస్యానికి ప్రతీక అని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, కౌన్సిలర్ కోవ రవి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు అలాల్ అజయ్, నల్ల మహేందర్, పర్వీస్ పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్, ఎస్పీకి వినతి పత్రాలు అందజేత

బోథ్, ప్రభాతవార్త:



మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని రెవెన్యూ సాధన కమిటీ సభ్యులు బుధవారం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఎస్పీలకు వినతి పత్రాన్ని అందజేశారు. ఇందులో సాధన కమిటీ సభ్యులు బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్, పసుల చంటి, అనిల్ మాసం, జక్కుల వెంకటేష్, షేక్ సమీర్, కట్ట భూమేష్ పాల్గొన్నారు.

## పేకాట రాయుళ్ల అరెస్ట్

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ప్రభాతవార్త :

కడెం మండలం ఉడుంపూర్ గ్రామ శివారులో గల మిషన్ భగీరథ పంప్ హౌస్‌లో మంగళవారం రోజున సాయంత్రం 5 గంటలకు పేకాట ఆడుతున్నారని సమాచారం మేరకు అక్కడికి వెళ్లి తనిఖీ చేయగా జన్నారం, కడెం మండలాలకు చెందిన 15 మంది పేకాట ఆడుతుండగా పట్టుకుని వారి వద్ద నుంచి 48,910 రూపాయలు సీజ్ చేయడం జరిగిందని కడెం ఎస్సై రాజు తెలిపారు. తదుపరి వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించి అరెస్ట్‌చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

